సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం : 26 : జనవరి : 2024



సొంతింటి కల సాకారం

గూడు లేని నిరుపేద తోటి, కొలాం ఆదివాసీలకు ఐటీడీఏలోని సీసీడీపీ విభాగం ఇళ్ల నిర్మాణం చేపట్టింది. ఒక్కో నిర్మాణానికి రూ.2.50లక్షలు వెచ్చిస్తోంది. IIలో▸



ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలి

ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ సూచించారు. పల్సి (బి) తండాలో అఖండ హరినామ యజ్ఞోత్సవం నిర్వహించారు. IIIలో▸

గరిష్టం/కనిష్టం
28.0/14.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలిగా ఉంటుంది. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

క్యాష్ అవార్డులకు ఎంపిక

బోథ్: బోథ్ అటవీరేంజ్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఫారెస్ట్ సెక్షన్ అధికారి సుందర్, ఫారెస్ట్ బీట్ అధికారి ధన్‌రాజ్‌ను ప్రశంసాపత్రం, రూ.10 వేల క్యాష్ అవార్డులకు ప్రభుత్వం ఎంపిక చేసింది. ఫారెస్ట్ సెక్షన్ అధికారి సుందర్‌కు రిజర్వ్ ఫారెస్ట్ ప్రొటెక్షన్‌లో, ఫారెస్ట్ బీట్ అధికారి ధన్‌రాజ్‌కు రిజర్వ్‌ఫారెస్ట్‌ను ఫైర్ నుంచి కాపాడడంలో అవార్డులు లభించాయి. శుక్రవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా వీరికి అధికారులు ప్రశంసాపత్రాలు, క్యాష్ అవార్డులు అందించనున్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న రవీందర్

బోథ్: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవీందర్ సూచించారు. గురువారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ఇంటర్ పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు ప్రణాళికతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. కళాశాల కరస్పాంటెండ్ ఎల్కాచి రాజశేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ప్రవీణ్‌రెడ్డి, కార్తీక్, దీప, ముత్యం, సతీశ్, నరేశ్, నవీన్, ప్రసాద్, రాజేశ్వర్, స్వామి, మహేశ్, అధ్యాపకులు, విద్యార్థులున్నారు.

అంకోలిలో ఘనంగా ఉర్సు



ర్యాలీగా దర్గాకు చేరుకుంటున్న భక్తులు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అంకోలి గ్రామ శివారులోగల సాదుల్లా బాబా దర్గాలో గురువారం ఘనంగా ఉర్సు నిర్వహించారు. నిర్వాహకుడు మంగారపు మల్లేశ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నిజామాబాద్, హైదరాబాద్‌కు చెందిన పకీర్ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. గ్రామం నుంచి ఉదయం ప్రారంభమైన శోభాయాత్ర సాయంత్రం దర్గాకు చేరింది. ఆదిలాబాద్ పట్టణంతో పాటు మహారాష్ట్ర నుంచి భక్తులు అధికసంఖ్యలో ఉర్సులో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ప్రొటోకాల్ పాటించేలా చూడాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్లు

కైలాస్‌నగర్: అధికారులు ప్రొటోకాల్ పాటించేలా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కౌన్సిలర్లు, పలువురు జెడ్పీటీసీ సభ్యులు కలెక్టర్ రాహుల్ రాజ్‌ను కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టర్‌ను అతడి ఛాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ సమాచారం పట్టణ, గ్రామప్రజాప్రతినిధులకు అందేలా చూడాలని కోరారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమ సమాచారం తమకు తెలుపలేదని కలెక్టర్‌కు వివరించారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ నియంతృత్వ పోకడలకు పోకుండా ప్రొటోకాల్ పాటించాలని సూచించారు. వైస్ చైర్మన్ జహీర్ రంజానీ తదితరులు పాల్గొన్నారు.



2021లో ఇంద్రవెల్లికి వచ్చినప్పుడు దప్పు కొడుతున్న రేవంత్‌రెడ్డి

ఇంద్రవెల్లిలోని అమరవీరుల స్తూపం

సారొస్తున్నారు!

- ఈవారంలో జిల్లాకు సీఎం రేవంత్‌రెడ్డి
- ఏర్పాట్లలో అధికారులు, సిబ్బంది
- ఇంద్రవెల్లిలో స్మృతివనానికి భూమిపూజ
- నాగోబా గుడిని సందర్శించే అవకాశం

సాక్షి, ఆదిలాబాద్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ వారంలోనే జిల్లాకు రానున్నారు. అధికారికంగా తేదీ ఖరారు కాకపోయినా 28 లేదా 29 తేదీల్లో ఆయన రావచ్చని చెబుతున్నారు. ఇందుకోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంద్రవెల్లిలోని అమరవీరుల స్తూపం వద్ద స్మృతివనం ఏర్పాటుకు ఆయన భూమిపూజ చేయనున్నారు. కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయాన్ని కూడా సందర్శించే అవకాశముంది. అయితే సభ ఉంటుందా.. లేదా.. అనే విషయంలో ఇంకా స్పష్టత లేదు.

అధికారుల పరిశీలన

ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం వద్ద ఏర్పాట్లను జిల్లా అధికారులు గురువారం పరిశీలించారు. ఇన్‌చార్జి ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఎస్పీ గౌస్ ఆలం, గిరిజన సంక్షేమశాఖ డీడీ దిలీప్, ఈఈ భీంరావు స్తూపం సమీపంలో హెలిప్యాడ్ కోసం స్థల పరిశీలన చేశారు. పక్కనే సభ నిర్వహణ కోసం స్థలం కూడా చూశారు. అనంతరం అక్కడి నుంచి కేస్లాపూర్ గ్రామానికి చేరుకుని నాగోబా ఆలయాన్ని సందర్శించారు. ఇక్కడ కూడా హెలిప్యాడ్, ఇతర అవసరాల కోసం స్థల పరిశీలన చేశారు. మొత్తంగా జిల్లాకు సీఎం రేవంత్‌రెడ్డి రాక ఖరారైనా అధికారిక షెడ్యూల్ ప్రకటించాల్సి ఉంది.



ఇంద్రవెల్లిలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

రెండున్నరేళ్ల కిందట..

2021 ఆగస్టులో టీపీసీసీ అధ్యక్ష హోదాలో రేవంత్‌రెడ్డి దళిత గిరిజన దండోరా సభ కోసం ఇంద్రవెల్లికి వచ్చారు. టీపీసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి సభ ఇంద్రవెల్లిలో నిర్వహించారు. ఆ సభ సక్సెస్ కావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం మిన్నంటింది. ఆ తర్వాత కాలంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగా రేవంత్‌రెడ్డి సీఎం అయ్యారు. దీంతో సెంటిమెంట్‌గా ఆయన తన జిల్లాల టూర్‌ను ఇంద్రవెల్లి నుంచే ప్రారంభిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రానుండడంతో అందరి దృష్టి ప్రస్తుతం ఆ పర్యటనపై నెలకొంది.

స్మృతివనం ఏర్పాటుకు రూ.కోటి

ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం వద్ద స్మృతివనం ఏర్పాటుకు ఎకరం స్థలం సేకరిస్తున్నారు. రూ.కోటితో వివిధ అభివృద్ధి పనులకు అంకురార్పణ చేయనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్తూపం వద్ద స్మృతివనం ఏర్పాటుకు భూమిపూజ నిర్వహించనున్నారు. స్తూపం చుట్టూ గ్రానైట్ రాళ్లతో మెట్లు తయారు చేయనున్నారు. ఈ స్థలం చుట్టూ చైన్‌లింక్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. పూర్తిస్థాయిలో గ్రీనరీ ఏర్పాటు చేయనున్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ



ప్రజాప్రతినిధులు, అధికారుల కోసం వేసిన కుర్చీలు

గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం



వేడుకలకు సిద్ధమైన పోలీస్ పరేడ్ మైదానం

- ముస్తాబైన పోలీస్ పరేడ్ మైదానం
- రెండేళ్ల తర్వాత అట్టహాసంగా వేడుకలు
- జెండా ఎత్తనున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: గణతంత్ర వేడుకలకు జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానం సర్వాంగసుందరంగా ముస్తాబైంది. కరోనా కారణంగా రెండేళ్లు కలెక్టరేట్ ఆవరణలో వేడుకలను సాదాసీదాగా నిర్వహించారు. రెండేళ్ల తర్వాత పరేడ్ మైదానంలో వేడుకలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పోలీసుల కవాతు, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించే మైదానాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. జాతీయ పతాకావిష్కరణ చేసే వేదికకు కొత్తగా రంగులు వేసి ముస్తాబు చేశారు. పూలతో అలంకరించారు. శుక్రవారం ఉదయం 9గంటలకు కలెక్టర్ రాహుల్‌రాజ్ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. పోలీసుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించిన అనంతరం జిల్లా ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. ఉదయం 9.45గంటల నుంచి పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించనున్నారు. అనంతరం జిల్లాలో అంకితభావంతో విధులు నిర్వహించిన ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేస్తారు. వివిధ ప్రభుత్వ శాఖలు తమ ప్రగతిని తెలియజేసేలా స్టాళ్లు ఏర్పాటు చేశారు. ఆయా శాఖలు తమ ప్రగతిని చాటిచెప్పేలా శకటాలను ప్రదర్శించనున్నారు. ఈ వేడుకలను తిలకించేందుకు వచ్చే పుర ప్రముఖులు, ప్రజాప్రతినిధుల కోసం ప్రత్యేకంగా కుర్చీలను సిద్ధం చేశారు. విద్యార్థులు, పట్టణ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఏర్పాట్లను కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి పరిశీలించారు. అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.



మైదానాన్ని సిద్ధం చేస్తున్న సిబ్బంది

డీఎంహెచ్‌వో, డీఐవోకు రాష్ట్రస్థాయి అవార్డులు



పురస్కారం అందుకుంటున్న డీఎంహెచ్‌వో నరేందర్



పురస్కారం అందుకుంటున్న డీఐవో శ్రీనివాస్

ఆదిలాబాద్‌టౌన్: డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ వైసీ శ్రీనివాస్‌కు రాష్ట్రస్థాయి అవార్డులు దక్కాయి. ఉత్తమ పనితీరు కనబర్చినందుకు వీరిని పురస్కారాలకు ఎంపిక చేశారు. గురువారం హైదరాబాద్‌లోని వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జెడ్ చోంగ్తు వీరికి పురస్కారాలు అందజేశారు. కాగా, జిల్లాలోని 18 ఆస్పత్రుల్లో ఎన్‌క్వాస్ అవార్డు వచ్చేందుకు చేసిన కృషికి గాను డీఎంహెచ్‌వో అవార్డు అందుకున్నారు. చిన్నపిల్లల ఇమ్యూనైజేషన్, ఎనీమియా ముక్త్ భారత్ కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేసినందుకు డీఐవో పురస్కారాన్ని దక్కించుకున్నారు.

సంస్కృతిని కాపాడుకోవాలి

- ఎస్పీ గౌస్ ఆలం
- గిరిజనులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎస్పీ గౌస్ ఆలం

ఇంద్రవెల్లి: సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని ఎస్పీ గౌస్ ఆలం సూచించారు. 'పోలీసులు మీ కోసం' కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని సమాక పంచాయతీ పరిధి పాటగూడ, ఇతర అనుబంధ గ్రామాలకు చెందిన 300మంది కొలాం గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ముందుగా కొలాం గిరిజనులు సంప్రదాయ వాయిద్యాలు వాయిస్తూ ఎస్పీకి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. కేంద్రం ప్రత్యేక నిధులు కేటాయించి కొలాం గిరిజన గ్రామాలాభివృద్ధికి కృషి చేస్తోందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఉన్నత చదువులు అభ్యసించి ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు పిల్లలను తప్పనిసరిగా చదివించాలని సూచించారు. పోలీస్ ఉద్యోగాల కోసం అర్హులైన యువకులకు ఉచిత శిక్షణ ఇస్తామని తెలిపారు. అనంతరం కొలాం గిరిజనులతో కలిసి భోజనం చేశారు. కొలాం గిరిజన చిన్నారులు, విద్యార్థులు చేసిన సంప్రదాయ నృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్, సీఐ రామకృష్ణ, ఎస్సై సునీల్, గ్రామ పటేల్ కోడప లక్ష్మణ్, ఎంపీటీసీ సభ్యుడు మడావి భీంరావ్ తదితరులున్నారు.



గుస్సాడి టోపీ ధరించిన ఎస్పీ

ప్రణాళికలు పక్కాగా రూపొందించాలి

- జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

కైలాస్‌నగర్: సబ్‌కీ యోజన–సబ్ కా వికాస్ 2024–2025 సంవత్సరానికి గాను జిల్లా పంచాయతీ అభివృద్ధి ప్రణాళికను పక్కాగా రూపొందించాలని జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్ సూచించారు. గురువారం జిల్లా పరిషత్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో సబ్‌కీ యోజన–సబ్ కా వికాస్ ప్రణాళికల తయారీపై జెడ్పీటీసీ సభ్యులు, అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో వ్యవహరిస్తూ జిల్లా అభివృద్ధికి తోడ్పడేలా ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. 15వ ఆర్థిక సంఘం ద్వారా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే నిధుల కోసం ఈ ప్రణాళికలు స్వీకరిస్తుందని తెలిపారు. జిల్లా పరిషత్ పరిధిలో చేపట్టాల్సిన పనులకు సంబంధించి సుదీర్ఘంగా చర్చించిన సభ్యులు వాటి కోసం తయారు చేయాల్సిన ప్రతిపాదనలపై పలు సూచనలు చేశారు. జెడ్పీ సీఈవో వీ గణపతి, డిప్యూటీ సీఈవో రాథోడ్ రాజేశ్వర్, జెడ్పీటీసీ సభ్యులు నర్సయ్య, అక్షిత, సంధ్యారాణి, బ్రహ్మానంద్, సుభద్రాబాయి, అరుంధతి, వనిత, గణేశ్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు అంజద్, తాహెర్ బీన్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులు, జెడ్పీటీసీ సభ్యులతో చర్చిస్తున్న జనార్దన్

రైతు కుటుంబాలను ఆదుకోవాలి



బాధితులతో మాట్లాడుతున్న బొర్రన్న

తాంసి: భీంపూర్ మండలం పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన కౌలు రైతు ఎడపెల్లి రమేశ్ పంట దిగుబడి రాక అప్పులపాలై ఆత్మహత్య చేసుకోగా.. బాధిత కుటుంబాన్ని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న గురువారం పరామర్శించారు. ఆత్మహత్యకు కారణాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బొర్రన్న మాట్లాడుతూ.. బాధిత కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆదుకోవాలని కోరారు. రూ.6లక్షల పరిహారంతోపాటు ప్రతీనెల రూ.5వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులు ఓంప్రసాద్, గంగయ్య, నందయ్య తదితరులున్నారు.

ఓటుతోనే ప్రజాస్వామ్య మనుగడ



ర్యాలీ ప్రారంభిస్తున్న అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- ఘనంగా ఓటరు దినోత్సవం

కైలాస్‌నగర్: ప్రజాస్వామ్య మనుగడకు ఓటు వజ్రాయుధంలాంటిదని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని గురువారం జెడ్పీ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్, ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటు విలువ, ప్రాధాన్యత అంశాలపై జిల్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రంగోలీ పోటీలు, నూతన ఓటర్లకు గుర్తింపు కార్డుల పంపిణీ, సీనియర్ సిటిజన్లకు సన్మానం, పాఠశాలలు, కళాశాలల స్థాయిలోని పిల్లలకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలలు, కళాశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులతో ఓటు హక్కుపై కలెక్టర్ ప్రత్యేక పతిజ్ఞ చేయించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు, విద్యార్థులు ఓటు ప్రాధాన్యతపై నిర్వహించిన అవగాహన ప్రదర్శన, నృత్యాలు అలరించాయి. సీనియర్ సిటిజన్లను శాలువాలతో సత్కరించారు. వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. అంతకు ముందు జిల్లా కేంద్రంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి ప్రారంభమైన ర్యాలీని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్, ఎస్పీ స్వయంగా బైక్ నడుపుతూ ర్యాలీలో పాల్గొన్నారు. కలెక్టర్ చౌక్, తెలంగాణ చౌక్, వినాయక్ చౌక్, నేతాజీ చౌక్, పంజాబ్ చౌక్ మీదుగా జెడ్పీ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. అధికారులు, పోలీసులు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో స్రవంతి, అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్, డీవైఎస్వో వెంకటేశ్వర్లు, డీపీఆర్వో విష్ణువర్ధన్, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలందప్రియ తదితరులు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలి

ఆదిలాబాద్‌టౌన్: బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలని అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ హాల్‌లో మహిళా శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, జిల్లా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ బాలికల దినోత్సవ వేడుకలకు జిల్లా సంక్షేమాధికారి మిల్కాతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ బాలిక సాధికారత సాధించాలని, పురుషులతో సమానంగా ముందుండాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సెస్సీలో 10 జీపీఏ సాధించిన విద్యార్థినులు, నేషనల్ స్పోర్ట్స్ లెవెల్ కాంపిటేషన్‌లో ఎంపికైన బాలికలు, నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్ పొందినవారికి, ఆయా రంగాల్లో రాణించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహంతో పాటు ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. నేషనల్ గర్ల్స్ చైల్డ్ 2024 జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన డ్రాయింగ్, స్పోర్ట్స్, సైన్స్‌ఫేర్, కాంపిటీషన్‌లో సెలెక్ట్ అయిన బాలికలకు మెడల్స్, ప్రశంసాపత్రాలను అందజేశారు. కేజీబీవీ విద్యార్థినులు సామాజిక స్పందన, బాల్య వివాహాలు, భ్రూణ హత్యల అంశాల్లో ప్రదర్శించిన నాటికలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ రమేశ్, సెక్టోరియల్ ఆఫీసర్ ఉదయశ్రీ, సీడబ్ల్యూసీ కమిటీ సభ్యులు సమీరుల్లా ఖాన్, మహిళ సాధికారత కేంద్రం జిల్లా మిషన్ కోఆర్డినేటర్ యశోద, డీసీపీవో రాజేంద్ర ప్రసాద్, సఖీ నిర్వాహకురాలు సరస్వతి, డీసీపీయూ సిబ్బంది, మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రం ఇస్తున్న అడిషనల్ కలెక్టర్

ఘనంగా పెర్సపెన్ ఊరేగింపు

సిరికొండ: మండలంలోని కోసుపటేల్ గూడ గ్రామంలో కుమ్రం వంశీయులు గురువారం పెర్సపెన్ ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ఆనవాయితీగా సంస్కృతి, సంప్రదాయ పద్ధతుల్లో పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. పొలిమేరలో దట్టమైన అడవిలోని పెర్సపెన్ దేవుడికి గంగాస్నానం (తుమ్ ఇవ్వడం) చేయించి తిరిగి కోసుపటేల్‌గూడకు చేరుకున్నారు. రాత్రి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించి ప్రత్యేక దూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో పెర్సపెన్ కుమ్రం భీంరావ్, కటోడ కుమ్రం కోసెరావ్, కటోడ కుమ్రం సోనెరావ్, కటోడ గ్రామపటేల్ కుమ్రం రావూజీ, దేవరి కుమ్రం జంగుబాపు, అధికసంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న కుమ్రం వంశీయులు

చోరీకి గురైన బైక్ పట్టివేత...

- పట్టించిన థర్డ్ ఐ



యజమానికి బైక్‌ను అప్పగిస్తున్న ట్రాఫిక్ ఎస్సైలు రాజశేఖర్, సాయికృష్ణ

నిర్మల్‌టౌన్: మూడు నెలల కిందట చోరీకి గురైన బైక్‌ను పట్టుకున్నట్లు పట్టణ ట్రాఫిక్ ఎస్సైలు రాజశేఖర్, సాయికృష్ణ తెలిపారు. వారి కథనం ప్రకారం .. హైదరాబాద్‌లోని పంజాగుట్టకు చెందిన ప్రవీణ్ బైక్‌ను మూడు నెలల కిందట పంజాగుట్టలో రోడ్డుపై పార్కింగ్ చేసి ఉండగా చోరీకి గురైంది. దీంతో ప్రవీణ్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గురువారం జిల్లా కేంద్రంలోని రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. అక్కడే ఉన్న బజాజ్ ఎలక్ట్రానిక్స్ షోరూం వద్ద బైక్ పార్కింగ్ చేసి ఉంది. నంబర్ ప్లేట్ లేకపోవడంతో అనుమానం వచ్చి బైకు ఇంజన్ నంబర్ పరిశీలించి థర్డ్ ఐలో ఎంట్రీ చేసి బైక్ యజమాని ఫోన్ నెంబర్ కనుగొన్నారు. అతడికి ఫోన్ చేయడంతో బైక్ చోరీకి గురైందని తెలిపాడు. ఒరిజినల్ బైక్ ధ్రువ పత్రాలు తీసుకురాగా.. పట్టణ సీఐ పురుషోత్తం పరిశీలించి బైక్ అప్పజెప్పారు. ఈ మేరకు పట్టణ ట్రాఫిక్ ఎస్ఐలను సీఐ అభినందించారు.

సొంతింటి కల సాకారం

- ఆదివాసీల ముఖంలో చిరునవ్వులు
- ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్మాణాలు
- ఒక్కో ఇంటికి రూ.2.50లక్షలు మంజూరు



నిర్మాణాలు పూర్తయిన ఇండ్లు



రాంజీగోండ్‌నగర్‌లో చేపడుతున్న నిర్మాణం

ఉట్నూర్‌రూరల్: జీవితంలో సొంతింటి కోసం ప్రతిఒక్కరూ కలలు కంటారు. అయితే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని వెనుకబడిన తోటి, కొలాం ఆదివాసీల కలలను నెరవేర్చేందుకు ఐటీడీఏలోని సీసీడీపీ విభాగం ఆధ్వర్యంలో ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు పూనుకుంది. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.2.50లక్షలు వెచ్చిస్తోంది. దీంతో నిరుపేదలైన కొలాం, తోటి ఆదివాసీలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ కల నిజమవుతోందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం వెయ్యి ఇళ్ల నిర్మాణాలు చేపట్టనుంది. ఇప్పటికే పలు ఇళ్ల నిర్మాణాలు పూర్తికాగా మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి.

వెయ్యి ఇళ్లు మంజూరు...

తోటి, కొలాం ఆదివాసీల కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 1000 ఇండ్లు మంజూరయ్యాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదిలాబాద్ జిల్లాకు 400, ఆసిఫాబాద్ కొమురం భీం జిల్లాకు 400, మంచిర్యాల 100, నిర్మల్ 100 ఇండ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి.. ఇందుకు కోసం ఒక ఇంటి నిర్మాణం కోసం రూ.2.50 లక్షలు వెచ్చిస్తోంది. నాలుగు ఫిల్లర్లతో కూడిన ఇల్లు, ఇంటిపై రేకులు, అదే విధంగా ఇంటి ముందర చిన్నపాటి షెడ్డు, బాత్‌రూం నిర్మాణం చేపడుతున్నారు. ఆరుగాలం కష్టించే ఆదివాసీల కోసం ఇంతటి సహాయం అందించడంపై సంతోసాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఇంటి కల నెరవేరింది..



మేము కూలీ చేస్తేనే పూట గడిస్తుంది. తమకు సొంత ఇంటిని నిర్మించి ఇవ్వడం ఆనందంగా ఉంది. సొంతిళ్లు లేక ఇన్నిరోజులు గుడిసెలో వర్షాకాలం, చలికాలం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాం. మా ఇంటి కల నెరవేరినట్లు అయింది.

– ఆత్రం సునీత, ఉట్నూర్, రాంజీగోండ్‌నగర్

సంతోషంగా ఉంది..



కూలీనాలి చేసుకుని జీవిస్తున్న తమకు ఐటీడీఏ ద్వారా ఇల్లు నిర్మాణం చేపట్టి ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉంది. ఇండ్లు లేక అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నాం.. తమకంటూ ఇల్లు కట్టి ఇవ్వడంతో తమ కుటుంబమంతా రుణపడి ఉన్నాం. ప్రభుత్వానికి, అధికారులకు ధన్యవాదాలు..

– టి.బాపూరావు, ఉట్నూర్ కొలాంగూడ

గిరిజనుల సంక్షేమమే ధ్యేయం



గిరిజనుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకెళ్తున్నాం. ఆదివాసీ తోటి, కొలాం ఆదివాసీల కోసం వెయ్యి ఇండ్లు నిర్మాణాలు చేపట్టడం జరిగింది. వారు ఇష్టానుసారంగా ఇల్లు నిర్మించుకునేందుకు అవకాశం కల్పించాం. జన్‌మన్‌లో కూడా గిరిజనుల అభివృద్ధికి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం.

– చాహత్ బాజ్‌పాయ్ ఐటీడీఏ పీవో

ఒంటరి మహిళలు, యువ జంటలే లక్ష్యం

- పోలీసులకు చెబుతామంటూ బెదిరింపులు
- విలేకరులమంటూ దౌర్జన్యం, ఆపై డబ్బులు డిమాండ్
- ఫోన్‌పే ద్వారా రూ.40వేలు వసూలు

మంచిర్యాలక్రైం: ఒంటరి మహిళలు, యువ జంటలను లక్ష్యంగా చేసుకుని బెదిరింపులకు పాల్పడుతూ డబ్బులు వసూలు చేసిన వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. నేషనల్ క్రైం బ్యూరో రిపోర్టర్‌గా చెలామణి అవుతున్న కుదురుపాక పోషం మరో వ్యక్తిని తోడుగా తీసుకెళ్లి ఈ నెల 22న రాత్రి జిల్లా కేంద్రంలోని కాలేజీ రోడ్ గోదావరి వద్ద ఓ యువతి, ఇద్దరు యువకులను బెదిరించారు. సదరు యువతీ, యువకులు రాత్రి 11గంటల ప్రాంతంలో అక్కడికి రాగా అప్పటికే అక్కడ కూర్చున్న పోషం, మరో వ్యక్తి కలిసి అడ్డుకున్నారు. విలేకరులమంటూ బెదిరిస్తూ మీడియా లోగోతో వారి నుంచి వివరాలు సేకరిస్తూ రికార్డు చేశారు. అసభ్య పదజాలంతో ప్రశ్నలు వేశారు. వివరాలు చెప్పడానికి ఆ జంట నిరాకరించడంతో పోలీసులను పిలిపిస్తామంటూ బెదిరించారు. వీడియో రికార్డు చేసిన అనంతరం వారి నుంచి సెల్‌ఫోన్లు లాక్కెళ్లి డబ్బులు డిమాండ్ చేసినట్లు తెలిసింది. డబ్బులు ఇవ్వకపోతే వీడియో వైరల్ చేస్తామని, బ్లాక్ మెయిల్ చేస్తూ బెదిరింపులకు పాల్పడ్డారు. సదరు యువకుడు రూ.30వేలు, రూ.10 వేలు మరోసారి మొత్తం రూ.40వేలు సత్యనారాయణ అనే వ్యక్తి నంబరుకు ఫోన్ పే చేశాడు. జంటను అడ్డగించి బెదిరిస్తూ తీసిన వీడియో వైరల్‌గా మారింది. ఈ ఘటనపై స్థానిక సీఐ రాజును సంప్రదించగా.. విచారణ చేస్తున్నామని తెలిపారు.

చుక్కల దుప్పి మృతి



మృతిచెందిన దుప్పి కళేబరం

కోటపల్లి: మండలంలోని నాగంపేట గ్రామ సమీపంలో అడవి కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృత్యువాత పడింది. గురువారం గ్రామానికి సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉన్న చుక్కల దుప్పిని చూసిన అడవి కుక్కలు వెంబడించి గాయపరచగా దుప్పి భయంతో గ్రామంలోకి పరుగులు తీసింది. అది గమనించిన స్థానికులు అడవి కుక్కలను తరిమికొట్టారు. అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని చుక్కల దుప్పిని ఫారెస్టు రేంజ్ కార్యాలయానికి తరలించారు. పశువైద్యాధికారి పవన్‌కుమార్ చికిత్స అందించేలోగానే దుప్పి మృతి చెందింది. దీంతో దుప్పి కళేబరానికి ఖననం చేశారు.

చెరువులో దూకి యువకుడి ఆత్మహత్య



అబ్దుల్ ఆమేర్ మృతదేహం

ఉట్నూర్‌రూరల్: మద్యానికి బానిసై మానసికస్థితి బాగోలేక చెరువులో దూకి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది... ఎస్సై మనోహర్ వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన అబ్దుల్ ఆమేర్ (33)భార్య పిల్లలతో కరీంనగర్‌లో కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం భార్యతో గొడవ పడి ఉట్నూర్ మండలంలోని నవోదయనగర్‌లో ఉన్న చిన్ననాన్న ఇంటికి వచ్చాడు. మానసికస్థితి బాగోలేక బుధవారం ఉదయం నుంచి కనిపించకుండా పోయాడు. గురువారం ఉదయం గంగన్నపేట చెరువులో శవమై తేలాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సంఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య అర్షియ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

పురుగుల మందు తాగి మరొకరు..

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని వాన్‌వాట్ గ్రామానికి చెందిన తలాండే సీతారాం(22) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సీతారాంకు ఇద్దరు సోదరిమనులు ఉండగా వారికి వివాహాలయ్యాయి. ఆయన తల్లిదండ్రులు మృతి చెందడంతో వాన్‌వాట్‌లో ఒంటరిగా ఉంటూ తనకున్న రెండెకరాల వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఒంటరిగా ఉండడంతో మానసికంగా కుంగిపోయి బుధవారం వ్యవసాయ పొలంలో పురుగులమందుతాగాడు. రాత్రి సమయంలో గమనించిన స్థానికులు మతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చెట్టును ఢీకొన్న కారు



పొన్నారి వద్ద ప్రమాదానికి గురైన కారు

తాంసి: మండలంలోని పొన్నారి గ్రామ సమీపంలో గురువారం కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభంతో పాటు చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్రలోని హింగోలీ వైపు వెళ్తున్న కారు పొన్నారి గ్రామానికి సమీపంలో వేగంతో అంతర్రాష్ట్ర రోడ్డుపై అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని, చెట్టుకు బలంగా ఢీకొట్టింది. దీంతో కారులోని శైలే కరాడే, సైభే కావే ఇద్దరికి గాయాలయ్యాయి. మరో ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. చికిత్స నిమిత్తం గ్రామస్తులు వారిని అంబులెన్స్ ద్వారా రిమ్స్‌కి తరలించారు. ఎస్సై శివరాం కారుని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బావిలోపడి యువకుడు మృతి

లక్సెట్టిపేట: మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన మహేష్(23) బావిలో పడి మృతి చెందినట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... మహేష్ కరీంనగర్‌లో మార్బుల్ వర్కు పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. సంక్రాంతి పండుగ కోసం ఇంటికి వచ్చి 15వ తేదీన రాత్రి ఫోన్ చూస్తుండగా చూడొద్దని తల్లి చెప్పింది. మరుసటి ఉదయం నుంచి కనిపించకుండా పోయాడు. గురువారం సాయంత్రం గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో శవమై కనిపించాడు. తల్లి మందలించడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తెలిపాడు. మృతుడి తల్లి గురువక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు..

సిర్పూర్(టి): మండలంలోని కంచర్‌పేట్ గ్రామ సమీపంలోని సిర్పూర్(టి)-కౌటాల ప్రధాన రహదారిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని లోనవెల్లి గ్రామానికి చెందిన దుర్గం దూలయ్య (65) చికిత్స పొందుతూ మృతి చెందాడు. సిర్పూర్(టి) ఎస్సై డికొండ రమేష్ వివరాల ప్రకారం... దుర్గం దూలయ్య మండలంలోని లోనవెల్లి గ్రామం నుంచి కౌటాల మండలంలోని తన కూతురు ఇంటికి వెళ్లేందుకు కంచర్‌పేట్ గ్రామం బస్టాప్ వద్ద వేచి ఉన్నాడు. బొలేరో ట్రాలీ వాహనం అతడిని ఢీకొనగా తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో కాగజ్‌నగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి, అక్కడి నుండి కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి కుమార్తె దుర్గం జనాబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గప్‌చుప్.. ఎక్కడివారక్కడే





గప్‌చుప్.. ఎక్కడివారు అక్కడే అన్నట్టుగా ఉంది కదూ ఈ చిత్రం.. ఆదిలాబాద్‌రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. సరైన వాహన పత్రాలు, హెల్మెట్ లేని వారికి జరిమానాలు విధించారు. పోలీసుల తనిఖీ నేపథ్యంలో వాహనదారులు ఎక్కడ తమకు చలాన్ విధిస్తారనే భయంతో కూతవేటు దూరంలో వాహనాలు నిలిపివేసి వారు అక్కడినుంచి వెళ్లిపోయే వరకు వేచి చూడాల్సి వచ్చింది. మరికొంత మంది వాహనదారులు అక్కడినుంచి వెనక్కి వెళ్లిపోయారు. ఇదిలా ఉండగా నంబర్ ప్లేట్ లేని వాహనాలను సైతం గుర్తించి పోలీసులు ఫైన్ వేస్తున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

- రూ. 7 లక్షల ఆస్తి నష్టం



దగ్ధమైన వంటగది

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని పొట్టిశ్రీరాములు చౌక్ సమీపంలోని ఓ ఇంట్లో గురువారం ఉదయం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... కాలనీకి చెందిన పాత అశోక్ ఇంటి మొదటి అంతస్తులో గోల్డ్‌స్మిత్ సత్యనారాయణ అద్దెకు ఉంటున్నాడు. ఈ క్రమంలో ఉదయం తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్తో ఇంట్లోని వంటగదిలో పొగలు కమ్ముకున్నాయి. గమనించిన సత్యనారాయణ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చాడు. సిబ్బంది చేరుకునేలోగా ఇంట్లోని ఫ్రిజ్, బీరువాతో పాటు ఫర్నిచర్, రూ.3లక్షల నగదుతో పాటు 20 గ్రాముల బంగారం కాలిపోయినట్లు బాధితుడు తెలిపాడు. రూ. 7లక్షల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

మతిస్థిమితం లేని మహిళ అదృశ్యం



తిరుపతమ్మ (ఫైల్)

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ బూడిద గడ్డ బస్తీకి చెందిన మతిస్థిమితం లేని ఓ మహిళ అదృశ్యమైనట్లు వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో బన్సీలాల్ తెలిపారు. భోగ తిరుపతమ్మ అనే గృహిణి మతిస్థిమితం సరిగా లేక ఈ నెల 20వ తేదీన ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతికినా ఫలితం లేదు. తిరుపతమ్మ ఆచూకీ తెలిసిన వ్యక్తులు 8712656559 నంబర్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు. కూతురు భోగ సుస్మిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ప్రత్యామ్నాయం లేక పాతదారిలోనే..

- దాడులు చేస్తున్నా ఆగని దందా
- ఏడాదిలో 116 కేసులు
- 5460 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం
- నేరాలకు పాల్పడుతున్న పాత నేరస్తులు
- కేసులపాలవుతున్న గిరిజనులు


తహసీల్దార్ ఎదుట బైండోవర్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గిరిజనులకు ప్రత్యామ్నాయ ఉపాధిమార్గాలు లేక మళ్లీ సారాయి తయారీనే నమ్ముకుంటున్నారు. ఫలితంగా కేసుల పాలవుతున్నారు. ఎక్సైజ్ అధికారులు నిత్యం దాడులు చేస్తున్నా సారాయి తయారీ మాత్రం ఆగడం లేదు. గుడుంబా తయారీకి ఉపయోగించే బెల్లం, పటిక మార్కెట్‌లో విచ్చలవిడిగా దొరుకుతున్నాయి. జిల్లాలోని తండాలు, అటవీ సమీప గ్రామాల్లో యథేచ్ఛగా గుడుంబా తయారీ చేసి సిరిసిల్ల, వేములవాడ పట్టణాలకు సరఫరా చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 3 ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో ఏడాదిలో ఎక్సైజ్ అధికారులు 116 కేసులు నమోదు చేశారు. 5,460 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి, 459 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు అధికారుల లెక్కలు తెలుపుతున్నాయి. గతంలో నాటుసారా తయారీ, విక్రయాలకు దూరంగా ఉన్న వారికి ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించింది. రుణాలు సైతం అందించి వ్యాపారులు పెట్టుకునేలా సహాయం అందించింది. రాజన్నసిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలంలోని చాలామంది గిరిజనులు కొందరు ఆటోలు, హోటళ్లు, దుకాణాలు పెట్టుకొని ఉపాధి పొందారు. అయితే ఆ పథకం కొందరికే లబ్ధి చేకూర్చింది. తర్వాత ఉపాధి అవకాశాలు కల్పించకపోవడంతో పలువురు గిరిజనులు మళ్లీ నాటుసారా తయారీ, విక్రయాలబాట పట్టారు.

చీకట్లోనే సరఫరా

తండాలు, పల్లెల్లో తయారవుతున్న గుడుంబాను రాత్రి వేళల్లో తయారీదారులే సిరిసిల్ల, కామారెడ్డి, వేములవాడ పట్టణాలకు తరలిస్తున్నారు. రాత్రిపూట గుడుంబాను తయారుచేసి తెల్లవారుజామున బైక్‌ల ద్వారా పట్టణ ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారు. అడ్డా కూలీలు ఎక్కువగా నివసించే ప్రాంతాలకు చేరవేస్తున్నారు. సారా తాగి చాలా మంది అనారోగ్యం పాలవుతున్నా జనం మాత్రం మారడం లేదు. ఫలితంగా తయారీదారులకు కాసులవర్షం కురిపిస్తుంది.

వరుస దాడులు.. ఆగని దందా

అధికారులు అనేకసార్లు దాడులు చేస్తున్నా గుడుంబా తయారీదారుల్లో మార్పు రావడం లేదు. ఏడాదికాలంలో జిల్లాలో 61 మందిపై ఎక్సైజ్, పోలీసులు కేసులు నమోదు చేశారు. ఇందులో బెల్లం విక్రయాల కేసులు రెండు ఉన్నాయి. మొత్తం ఏడాదిలో 116 కేసులు నమోదు చేయగా, 34 మందిని బైండోవర్ చేశారు. ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలో నిత్యం ఏదో ఒక చోట అధికారులు దాడులు చేసి బెల్లం పానకం ధ్వంసం చేస్తూ.. నాటుసారాను స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేస్తూనే ఉన్నారు. అయితే పీడీయాక్ట్ నమోదు చేసి సారాతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తే తప్పా ఈ దందాకు బ్రేక్ పడదని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

మళ్లీ.. మళ్లీ పట్టుబడుతూ..

నాటుసారా తయారీ, విక్రయాల్లో పాతవారే ఎక్కువగా పట్టుబడుతున్నారు. గతంలో నాటుసారా తయారీ, విక్రయాలు చేస్తుండగా పట్టుబడ్డ వారే మళ్లీ విక్రయిస్తూ దొరుకుతున్నారు. పట్టుబడ్డ నేరస్తులను అధికారులు తహసీల్దార్‌ల ఎదుట బైండోవర్ చేస్తారు. ఆ సమయంలో రూ.లక్ష పూచీకత్తు ఇచ్చి విడుదలవుతారు. ఏడాదిలో తిరిగి నేరానికి పాల్పడితే రూ.లక్ష పూచీకత్తు సొమ్మును చెల్లించాల్సిందే. ఇలా ఏడాదిలో రూ.7.66 లక్షలు జరిమానాలు చెల్లించారు. సారా తయారీదారుల్లో మార్పు రాకపోవడంతో నేరాల సంఖ్య పెరుగుతూనే ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో దండోరా వేయించి, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నా నాటుసారా మత్తుకు ప్రజలు దూరం కావడం లేదు.


బెల్లం పానకం ధ్వంసం చేస్తున్న అధికారులు

కఠిన శిక్షలు అమలు



నాటుసారా తయారీకి వినియోగించే బెల్లం, పట్టిక విక్రయిస్తే కఠిన శిక్షలు అమలు చేస్తాం. ప్రస్తుతం శిక్షల స్వరూపం మారిపోయాయి. బెల్లం అమ్మితే పదిహేను రోజుల వరకు బెయిల్ మంజూరు కావడం లేదు. పాతనేరస్తులకు నెల రోజుల వరకు నిబంధనలతో బెయిల్ ఇస్తున్నారు. గుడుంబా తయారీ, విక్రయదారుల గురించి తమకు సమాచారం అందించాలి. గుడుంబా విక్రయాలను అరికడతాం.

– ఎంపీఆర్ చంద్రశేఖర్, ఎక్సైజ్ సీఐ, ఎల్లారెడ్డిపేట

సిరిసిల్ల అడిషనల్ ఎస్పీకి ప్రెసిడెంటల్ మెడల్

సిరిసిల్లక్రైం: రాజన్నసిరిసిల్ల జిల్లా అడిషనల్ ఎస్పీ చంద్రయ్య ప్రెసిడెంటల్ మెడల్‌కు ఎంపికయ్యారు. సుదీర్ఘకాలంగా పోలీస్‌శాఖలో వివిధ హోదాల్లో చూపిన ప్రతిభను గుర్తించిన ప్రభుత్వం చంద్రయ్యను ఈ అవార్డుకు ఎంపిక చేసింది. 1991లో ఎస్సైగా పోలీసుశాఖలో ఉద్యోగం పొందిన చంద్రయ్య తొలిపోస్టింగ్ కొత్తగూడెంలో, 2007లో సీఐగా పదోన్నతి పొంది వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో పనిచేశారు. 2017లో డీఎస్పీగా పదోన్నతి పొంది రామగుండం క్రైం ఏసీపీగా, హన్మకొండ, సైబరాబాద్ ఏసీపీగా పనిచేశారు. 2021లో అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొంది సిరిసిల్లలో బాధ్యతలు స్వీకరించారు. పోలీస్‌శాఖలో సుదీర్ఘకాలం పనిచేసిన అధికారిగా సేవలను గుర్తించి ప్రెసిడెంటల్ పోలీస్ మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్ మెడల్‌కు ఎంపిక చేస్తూ గురువారం సమాచారం ఇచ్చారు. దీనిపై ఏఎస్పీ చంద్రయ్య 'సాక్షి'తో మాట్లాడుతూ అన్ని హోదాలను, కఠిన ఠాణాల్లో పనిచేసిన విధానాలను పరిగణలోకి తీసుకుని పతకానికి ఎంపిక చేయడం ఆనందంగా ఉందన్నారు. పేదలకు సాయం చేయడంలో సంతృప్తి ఉంటుందని, పోలీసుశాఖలో పనిచేయడంలో ఆ అవకాశం దొరికిందన్నారు. త్వరలోనే రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. అవార్డుకు ఎంపికైన ఏఎస్పీ చంద్రయ్యను జిల్లా ఎస్పీ అఖిల్‌మహాజన్ గురువారం అభినందించారు. ఈ అవార్డుకు ఎంపికవడం జిల్లాకు గర్వకారణంగా ఉందన్నారు.


చంద్రయ్య

రాజన్నకు సీతక్క పూజలు

వేములవాడ: రాజన్నను రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్క గురువారం కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆమెను ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, ఆలయ ఈవో కృష్ణప్రసాద్ ఘనస్వాగతం పలికారు. స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకుల బృందం పూర్ణకుంభకలశంతో ఆలయ ప్రదక్షిణలు చేయించారు. అనంతరం అద్దాల మండపంలో ప్రసాదాలు అందించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ రాజన్న తమ ఇలవేల్పు అని, చిన్నప్పటి నుంచి ఇక్కడికి వస్తూనే ఉంటామన్నారు. రెండేళ్లకోమారు వచ్చే సమ్మక్క, సారలక్క జాతర మహోత్సవాలకు ముందుగా రాజన్నను దర్శించుకుని వెళ్లే సాంప్రదాయం ఉందన్నారు. ఈసారి సమ్మక్క జాతరకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు జిల్లాకు వచ్చిన మంత్రి సీతక్కకు కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, ఆర్డీవో మధుసూదన్‌రావు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.


మంత్రి సీతక్కను సన్మానిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

శాతకర్ణి-1 కుమారుడే ఆస్మాకరాజ్య పాలకుడు

- పెద్దపల్లిలో శాతవాహనుల శాసనంలో వెలుగులోకి


పెద్దపల్లి జిల్లా గట్టుసింగారంలో లభించిన శాసనం

సాక్షి, పెద్దపల్లి: దక్షిణ భారతంలో తొలి సామ్రాజ్యంగా ఏర్పడిన శాతవాహన రాజ్యం కోటిలింగాల కేంద్రంగా పరిపాలన కొనసాగించారు. ఇది నిరూపించేలా పెద్దపల్లి జిల్లాలోని గట్టుసింగారం ప్రాంతంలో శాతవాహన యువరాజు హకుసిరికి సంబంధించిన శాసనం లభ్యమైంది. ఈ శాసనం ఒకటో శతాబ్దానికి చెందిన ప్రాకృతం, బ్రాహ్మీలిపిలో ఉందని పురావస్తుశాఖ మాజీ అధికారి బీఎం.రెడ్డి, ఫొటో జర్నలిస్టు డి.రవీందర్ తెలిపారు. ఈ శాసనంలో శాతకర్ణి-1, అతడి భార్య నాగానిక కుమారుడు హకుసిరి, అతడి స్నేహితుడు హరిత్రీపుత్ర గురించి తెలిపేలా అసంపూర్తిగా ఉందని, అలాగే 16 మహాజన పదాల్లో ఒక్కటైన ఆస్మాకా ప్రాంతాన్ని పరిపాలించినట్లు అందులో ఉన్నట్లు గుర్తించారు. గతంలో శాతకర్ణి-1 కుమారుడు హకుసిరి గురించి తెలిపే శాసనం కరీంనగర్ జిల్లా మక్కట్‌రావుపేటలో లభించిందని, ఇది రెండో శాసనమన్నారు. శాతకర్ణి కుమారుడు హకుసిరి గురించి నానేఘడ్ శాసనంలో ఉందని తెలిపారు.



ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలి

- సర్పంచుల ఆత్మీయ సమ్మేళనంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్


సర్పంచులను సన్మానిస్తున్న మాజీ మంత్రి

ధర్మపురి: గెలిచినా.. ఓడినా ప్రజాసమస్యలపై నిరంతర పోరాడాలని మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ బీఆర్‌ఎస్ నాయకులకు పిలుపునిచ్చారు. సర్పంచులు ఐదేళ్ల పాలనను విజయవంతంగా ముగించుకుంటున్న సందర్భంగా గురువారం స్థానిక ఎస్‌హెచ్ గార్డెన్‌లో నియోజకవర్గంలోని సర్పంచులతో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కొప్పుల మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ హయాంలో గ్రామాల్లో సర్పంచులు చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్ తిరిగి ఘన విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో దేశంలో ఎక్కడా జరగని అభివృద్ధి తెలంగాణలో జరిగిందన్నారు. వ్యవసాయానికి నిరంతర విద్యుత్, సాగునీరు అందించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి రెండు నెలలు కాకముందే కరెంట్ కష్టాలు మొదలయ్యాయని ఆరోపించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు సాధ్యంకానివన్నారు. అంతకముందు నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ సర్పంచులను సన్మానించి మెమోంటోలు అందించారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ బత్తిని అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, నాయకులు సొల్ల భీమయ్య తదితరులున్నారు.

రాజన్న సన్నిధిలో భక్తుల రద్దీ



- 30 నుంచి త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు

వేములవాడ: వేములవాడ రాజన్నను గురువారం 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తుల రాక పెరగడంతో ఆలయ ఆవరణ రద్దీగా మారింది. ఆలయ ఈవో కృష్ణప్రసాద్, ఏఈవో శ్రీనివాస్, పర్యవేక్షకులు తిరుపతిరావు, అల్లి శంకర్, శ్రీరాములు పరిశీలించారు.

30 నుంచి త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు

ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు జగద్గురు త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే కళాకారులను ఎంపిక చేశారు. ఆహ్వాన పత్రికలను ముద్రించారు. ఐదు రోజుల పాటు త్యాగరాజ స్వామి కీర్తనలు, కూచిపూడి, నృత్య, నాటక ప్రదర్శనలతో రాజన్న క్షేత్రం ఓళలాడనుంది.


శిథిలావస్థలో కోట


కొనసాగుతున్న కోనేరు నిర్మాణ పనులు

గోండు రాజుల కోటకు కొత్త కళ

గోండుల వైభవానికి చిహ్నంగా నిలిచిన ఉట్నూర్ డివిజన్ కేంద్రంలోని పురాతన గోండు రాజుల కోట పూర్వ వైభవాన్ని సంతరించుకుంటోంది. కేబీ కాంప్లెక్స్ సమీపంలోని ఈ కోట నిర్వహణ లోపంతో శిథిలావస్థకు చేరి కోనేరు, కోట ప్రధాన భాగాలు కూలిపోయాయి. దీన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని భావించిన అప్పటి ప్రభుత్వం రూ.2.30కోట్లు మంజూరు చేసింది. పనులు యుద్ధప్రాతిపదికన కొనసాగుతుండటంతో త్వరలోనే కోట కొత్త కళ సంతరించుకోనుంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్


కొనసాగుతున్న పునర్నిర్మాణ పనులు

సంప్రదాయబద్ధంగా మహాపూజ

- జంగుబాయి క్షేత్రానికి తరలివచ్చిన భక్తులు
- ఎంపీ సోయం బాపూరావు ప్రత్యేక పూజలు


గుహ వద్ద ఎంపీ సోయం బాపూరావు, నాయకులు, తదితరులు

కెరమెరి(ఆసిఫాబాద్): కెరమెరి మండలంలోని మహారాజ్‌గూడ అడవుల్లో కొలువైన జంగుబాయి అమ్మవారి క్షేత్రంలో గురువారం మహాపూజ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. మైసమ్మ, పోచమ్మ, రావుడ్ దేవతలకు మొక్కులు చెల్లించారు. అనంతరం సిద్దికసలోని జై జంగు జైలింగు దీక్షాపరులతో కలిసి సిద్దికసలోని గుహలోకి వెళ్లి పుణ్యస్నానం ఆచరించారు. జంగు, లింగు దేవతలు, శివలింగానికి పూజలు చేశారు. ఎంపీ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలన్నారు. జంగుబాయి దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కొందరు పని కట్టుకుని తనపై ఆరోపణలు చేస్తున్నారని, తుడుందెబ్బకు ఎలాంటి ద్రోహం చేయలేదని స్పష్టం చేశారు. ఆలయానికి రోడ్డు, తాగునీటి సౌకర్యం కల్పిస్తామని, టొప్లకసలో రూ.10లక్షలతో షెడ్డు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ, మహారాష్ట్ర ఆలయ కమిటీ చైర్మన్లు కొడప జాకు, వెట్టి చందు, సర్పంచ్ లింబాదాస్, పూజారి హన్మంత్‌రావు, కటోడ నాగోరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ కోదండరాం.. ఎమ్మెల్సీ

- గవర్నర్ కోటాలో పదవిపై హర్షం
- స్వస్థలం నెన్నెల మండలం జోగాపూర్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు, టీజేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ ముద్దసాని కోదండరాం గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎంపికయ్యారు. ఆయనకు పదవీ దక్కడంపై మంచిర్యాల జిల్లా వాసులు, సన్నిహితులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం ఊటూరు నుంచి మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం జోగాపూర్‌కు వలస వచ్చారు. తల్లిదండ్రులు జనార్దన్‌రెడ్డి, వెంకటమ్మ. ఏడుగురు సంతానంలో కోదండరాం ఒకరు. కోదండరాం 1955 సెప్టెంబర్ 5న జన్మించారు. భార్య సుశీల కాగా, వీరికి ఇద్దరు సంతానం. అందరూ ఉద్యోగ, వృత్తిరీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఆయన సోదరుడు రంగారెడ్డి కుటుంబం మాత్రం ప్రస్తుతం జోగాపూర్‌లోనే ఉంటోంది. బాల్యం నుంచే రాడికల్ భావజాలంతో పెరిగిన కోదండరాం ఉమ్మడి కరీంనగర్, వరంగల్, హైదరాబాద్‌లో విద్యాభ్యాసం పూర్తి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్‌గా బోధించి రిటైర్డ్ అయ్యారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో రాజకీయ జేఏసీ చైర్మన్‌గా కీలకంగా వ్యవహరించారు. తెలంగాణ జన సమితి పార్టీ స్థాపించారు. ఉమ్మడి జిల్లా వాసులు అనేకమందితో సాన్నిహిత్యం ఉంది. తెలంగాణ విద్యావంతుల వేదిక, సింగరేణి ఓపెన్‌కాస్టులు, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలోనూ ఇక్కడికి పలుమార్లు వచ్చారు. ఇప్పటికీ తమ వారసత్వంగా ఇల్లు, ఆస్తులు, భూములు ఉన్నాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మంచిర్యాల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తారనే ప్రచారం జరిగింది. తాజాగా ఎమ్మెల్సీగా ఎన్నిక కావడంపై ఆయన సన్నిహితులు, స్నేహితులు గుర్తు చేసుకున్నారు.


కోదండరాం

'మంచిర్యాల-అంతర్గాం' బ్రిడ్జి నిర్మించాలి

- మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కాలేజీ రోడ్డు నుంచి అంతర్గాం వరకు గోదావరి నదిపై బ్రిడ్జి నిర్మించాలని మాజీ ఎమ్మెల్యే, ఆర్టీసీ మాజీ చైర్మన్ గోనె ప్రకాశ్‌రావు డిమాండ్ చేశారు. మంచిర్యాల, అంతర్గాంల మధ్య గోదావరి నదిపై బ్రిడ్జి నిర్మాణాన్ని పోరాడి సాధించామని తెలిపారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుమురంభీం ఆసిఫాబాద్‌తోపాటు మంచిర్యాల జిల్లాకు చెందిన ప్రజలు ఈ బ్రిడ్జి గుండా మంచిర్యాల నుంచి పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్ వరకు ప్రయాణిస్తే 45 నిమిషాలు ముందుగానే వెళ్తారని అన్నారు. 2018 ఎన్నికల సమయంలో సీఎం హోదాలో కేసీఆర్ శ్రీరాంపూర్‌లో ఇచ్చిన హామీ మేరకు బ్రిడ్జి నిర్మాణం కోసం అఖిలపక్షం ఆధ్వర్యంలో పోరాడామని అన్నారు. బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.64 కోట్లు విడుదల కాగా, మూడు నెలల క్రితం టెండరు కూడా పూర్తి చేశారని తెలిపారు. ప్రస్తుతం పనులను ప్రారంభించడం వల్ల వర్షాకాలం నాటికి పిల్లర్ల నిర్మాణం పూర్తయి, బ్రిడ్జిని రెండేళ్లలో నిర్మించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ విషయమై ప్రస్తుత ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి వినతిపత్రం ఇచ్చానని అన్నారు. కొందరు మంచిర్యాల, అంతర్గాం బ్రిడ్జిని నిర్మించకుండా, ముల్కల్ల వద్ద నిర్మించాలని చూస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. దాని వల్ల ప్రజలకు మేలు జరగకపోగా కోర్టు కేసులు, భూపరిహారం ఇలా ఏళ్ల తరబడి బ్రిడ్జి నిర్మాణానికి దూరంగా ఉండాల్సిన పరిస్థితి వస్తుందని, బ్రిడ్జిని ముల్కల్లకు ఎవరు మార్చాలని అనుకుంటున్నారో తెలియడం లేదని తెలిపారు. బ్రిడ్జి నిర్మాణాన్ని ఆపాలని ఎవరైనా చూస్తే తాను ఊరుకోబోనని స్పష్టం చేశారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు

ఖండేవ్ పుణ్యక్షేత్రానికి తొడసం వంశీయులు


మాసేమాల్ దేవతకు పూజలు చేస్తున్న తొడసం వంశస్తులు

నార్నూర్: తొడసం వంశస్తుల ఆరాధ్యదైవం ఖండేవ్ ఆలయ పుణ్యక్షేత్రానికి తొడసం వంశస్తులు సంప్రదాయ వాయిద్యాలతో ఎడ్లబండిపై గురువారం చేరుకున్నారు. బుధవారం రాత్రి మండలంలోని మాన్కాపూర్ వద్ద మాసేమాల్ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి అక్కడే బస చేశారు. గురువారం ఉదయం పుణ్యస్నానాలు ఆచరించిన తర్వాత ఆదివాసీ గిరిజనుల ఆచారం ప్రకారం పూజలు చేశారు. మధ్యాహ్నం ఎడ్లబండిపై కొందరు.. మరి కొందరు పూజ సామగ్రితో కాలినడకన ఖండేవుని పుణ్యక్షేత్రానికి చేరుకున్నారు. సాయంత్రం నిర్వహించిన పూజ కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి పాల్గొన్నారు. వారితో కలిసి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల ఆదివాసీ గిరిజనులకు ఎంతో పవిత్రమైందని పేర్కొన్నారు. తరతరాల నుంచి సంస్కృతి సంప్రదాయాలను కాపాడాలని కోరారు. ఖండేవు ఆలయ అభివృద్ధితో పాటు భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించడానికి తనవంతు సహాయసహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తొడసం వంశానికి చెందిన కటోడ బాపురావు, తెలంగాణరావు, తొడసం నాగోరావు, సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ కాంతారావు దుర్గే, మాజీ ఎంపీపీ మెస్రం రూప్‌దేవ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మెస్రం హన్మంతరావు, నాయకుడు సయ్యద్‌ఖాశీం తదితరులున్నారు.


ఖండేవుని సంప్రదాయ మహాపూజలో ఎమ్మెల్యే





ఆర్టీసీ బస్టాండ్‌లో అడ్డదిడ్డంగా పార్కింగ్

నిర్మల్ ఆర్టీసీ బస్టాండ్‌లో వాహనాలను అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. కుటుంబ సభ్యులు, బంధువులను ద్విచక్రవాహనాలపై బస్టాండ్‌కు తీసుకువస్తున్నవారు నోపార్కింగ్ ప్లేస్‌లో బైక్‌లు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో బస్సులు పాయింట్‌పైకి తీసుకురావడానికి డ్రైవర్లుఇబ్బంది పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు ఎన్ని చర్యలు తీసుకున్నా ద్విచక్రవాహనదారులు, ఆటో వాలాల తీరు మారడం లేదు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్

